'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 89 | శనివారం | 14.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 89 | Saturday | 14.11.2026 | Pages: 8 | Rate: 2

రాహుల్ వస్తే.. నెప్పేంటి?



- భారత్ సమ్మిట్‌కు రాకపై కాక
- బీజేపీకి సీఎం రేవంత్ కౌంటర్

రాహుల్ గాంధీ భారత్ సమ్మిట్‌కు వస్తే బీజేపీకివచ్చినఇబ్బందేమిటినిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఆహ్వానం మేరకు హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీకి రెండు కీలక బాధ్యతలు ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన గిగ్ కార్మికుల విధానాన్ని అధికారికంగా ప్రారంభించడంతో పాటు, భారత్ సమ్మిట్ వేదికగా దేశం తరఫున ప్రపంచానికి సందేశం ఇవ్వనున్నారని వివరించారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత మాత్రమే కాదని, గతంలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మాజీ ప్రధానుల కుటుంబానికి చెందిన వ్యక్తి అని గుర్తుచేశారు. ఆయన రాకను రాజకీయ కోణంలో చూడటం సరికాదని, సమ్మిట్‌లో వచ్చే సూచనలను భవిష్యత్తులో జాతీయ విధానాల రూపకల్పనకు ఉపయోగించుకుంటామని చెప్పారు. (వివరాలు 2లో..)

ఎల్‌నినో దెబ్బ

కేంద్రం సాయం కోరనున్న తెలంగాణ!

రైతుల కోసం ఢిల్లీకి సీఎం బృందం

నవంబర్ 15న మోదీతో రేవంత్ భేటీ

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్రం సాయం కోరుతోంది. వర్షాభావం, లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ రంగం, రైతులు, గ్రామీణజీవనంపై పడుతున్నప్రభావాన్నిప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు నవంబర్ 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రధానిని కలవనున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించి, కరువు నివారణ చర్యలకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కేంద్రాన్ని కోరనున్నారు. ముఖ్యంగా వర్షాలు సరిగా కురవకపోవడంతో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధానికి వివరించనున్నారు. (వివరాలు 2లో..)



భారత్ సమ్మిట్.. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్

5లో..

- భారత్ సమ్మిట్‌పై పెరిగిన ఎక్స్‌పెక్టేషన్
- పెట్టుబడులకు హైదరాబాద్ డెస్టినేషన్
- గ్లోబల్ సదస్సుతో ప్రపంచ స్థాయి రికగ్నిషన్
- భట్టి నేతృత్వంలో తెలంగాణ ప్రజంటేషన్

దావోస్‌లో పెట్టుబడుల చర్చలు జరుగుతాయి.. హైదరాబాద్‌లో ఇక ప్రపంచ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై చర్చలు జరగబోతున్నాయి! ఐటీకి కేరాఫ్‌గా.. పెట్టుబడులకు గమ్యస్థానంగా.. అంతర్జాతీయ సంస్థలకు చిరునామాగా నిలిచిన భాగ్యనగరానికి ఇప్పుడు మరో అరుదైన గుర్తింపు తీసుకురావాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. అదే భారత్ సమ్మిట్ 2.0! ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మత విద్వేషాలు, కుల విభజనలు, ఆర్థిక అసమానతలు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ఒత్తిళ్లకు పరిష్కారాలు వెతికే అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ మహా సంకల్పానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేస్తున్నారు. 70 దేశాలు.. వెయ్యికి పైగా అంతర్జాతీయ ప్రతినిధులు.. ప్రపంచ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల ప్రముఖుల సమాగమం! నెహ్రూ అలీన విధానం నుంచి గాంధీజీ అహింసా సిద్ధాంతం వరకు.. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర నుంచి ప్రపంచ శాంతి వరకు.. చర్చల పరిధి విస్తృతం. మరోవైపు తెలంగాణ రైజింగ్‌తో రాష్ట్ర అభివృద్ధి నమూనాను ప్రపంచానికి పరిచయం చేసే వ్యూహం! అసలు దావోస్‌కు దీటుగా హైదరాబాద్‌ను నిలబెట్టాలన్న భట్టి ఆలోచన వెనుక ఉన్న అసలు వ్యూహం ఏమిటి? భారత్ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్తును ఎలా మార్చబోతోంది? కాంగ్రెస్ ప్రభుత్వం రచిస్తున్న ఈ అంతర్జాతీయ ప్రణాళికలో భట్టి పాత్ర ఏమిటి?



వంద కోట్లతో ప్రచార ఆర్భాటమా?

ప్రజా సమస్యలపై రాహుల్ మౌనం?

భారత్ సమ్మిట్‌పై కేటీఆర్ ప్రశ్నల వర్షం

తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు భారత్ సమ్మిట్ పేరుతో ప్రచార కార్యక్రమానికి వస్తారా? తెలంగాణ ప్రజల సొమ్ము రూ.100 కోట్లు ఖర్చు చేసి నిర్వహిస్తున్న కార్యక్రమం ద్వారా ఎవరికి ప్రయోజనం కల్పించాలనుకుంటున్నారు? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. (2లో..)




2లో..

లక్ష కోట్ల భూములు ఎక్కడికి పోతున్నాయ్?

ట్రక్ పార్క్ వేలంపై హరీశ్ రావు ఆరోపణలు

రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూములు అమ్మడం తప్ప ప్రజలకు చేసిన మంచి పని ఒక్కటీ లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటివరకు దాదాపు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని ఆరోపించారు.



సిద్దిపేటలో హరీశ్‌కు కవిత సవాల్!

అవినీతి ఆరోపణలతో రాజకీయ సమరం

ప్రజల్లోకి వెళ్తాం.. టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

సిద్దిపేటలో రాజకీయ పోరుకు సిద్ధమయ్యానని, రాబోయే ఎన్నికల్లో అక్కడ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మాజీ మంత్రి హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఆరోపణలు చేశారు. (వివరాలు 2లో..)



ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్!

• ముగింపు దశకు విచారణ • సంచలనాలు ఖాయమన్న సీఎం

ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలోనే విచారణ ముగియనుందని, అనేక సంచలన విషయాలు వెలుగులోకి రాబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఈ కేసుపై నవంబర్ 13న హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఫోన్‌ను ప్రధాని మోదీ ట్యాప్ చేయిస్తున్నారంటూ ఆరోపించిన నేపథ్యంలో, మీ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురవుతోందా అని మీడియా ప్రతినిధులు సీఎంను ప్రశ్నించారు. (వివరాలు 2లో..)

రాహుల్‌ను విమర్శిస్తే సహించం!

బీజేపీ, బీఆర్ఎస్‌పై పొన్నం ఫైర్

రాహుల్ గాంధీ స్థాయిని విమర్శించే అర్హత బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. దేశ ప్రజలందరూ ప్రేమతో, ఐక్యతతో ఉండాలని కోరుకునే నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. సామాజిక న్యాయం సాధన, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల



కాపాడటమే ఆయన రాజకీయ లక్ష్యమని పేర్కొన్నారు. (వివరాలు 3లో..)

ఆటో కార్మికులకు సొంతింటి భాగ్యం!



- రెండు వేల కుటుంబాలకు ఇందిరమ్మ భరోసా
- రూ.220 కోట్లతో ఆటో నగర్ కాలనీ నిర్మాణం (3 లో..)



3లో..

భూగర్భ జలాలపై సర్కారు దృష్టి!

» యాసంగికి ముందే నీటి లెక్కలు

» ఎల్‌నినో ముప్పుపై కార్యాచరణ

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాలు తగ్గి భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలను కాపాడేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. యాసంగి పంటల సాగుకు ముందే ప్రతి ప్రాంతంలో నీటి లభ్యతను శాస్త్రీయంగా అంచనా వేసి, అందుకు అనుగుణంగా రైతులకు పంటల సాగుపై సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సచివాలయంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితోకలిసి ఉన్నతాధికారులు, నిపుణులతో భూగర్భ జలాల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.

ప్రపంచానికి శాంతి, సమానత్వమే దిక్సూచి

- ప్రజాస్వామ్యమే పునాది.. ద్వేషానికి తావులేదు!
- భారత్ సమ్మిట్ వేదికగా భట్టి విక్రమార్క సందేశం

ప్రజాస్వామ్యం..అహింస..సమానత్వం..న్యాయం.. ఇవే ప్రపంచ శాంతికి పునాదులని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా విభేదాలు పెరుగుతున్న వేళ ద్వేషం, అసహనానికి తావులేకుండా పరస్పర గౌరవం, మానవీయ విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు,



గౌరవం కల్పించడం అంతర్జాతీయ సమాజం ముందున్న ఉమ్మడి బాధ్యతగా అభివర్ణించారు. సరిహద్దులకు, తరాలకు అతీతంగా నిలిచే ఈ విలువలే న్యాయబద్ధమైన ప్రపంచ నిర్మాణానికి మార్గమని పేర్కొన్నారు. (వివరాలు 2లో..)

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా!

తెలంగాణలో సరికొత్త సంక్షేమ పథకం

ఈనెల 19 నుంచి ఇన్సూరెన్స్ సౌకర్యం

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి బీమా రక్షణ అందించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దేశంలోనే ప్రతి కుటుంబానికి సార్వత్రిక జీవిత బీమా కల్పిస్తున్న తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలవబోతోందని వెల్లడించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' నమోదు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. కుటుంబంలో



ఉపాధి పొందుతున్న వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. గతంలో అమలైన బీమా పథకాలు కొన్ని శాఖలు, నిర్దిష్ట వర్గాలకే పరిమితమయ్యాయని, ఇప్పుడు ప్రతి కుటుంబానికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు (వివరాలు 2లో..)



6లో..

రాహుల్ పిలుపే శాసనం.. గాంధీ కుటుంబమే ప్రాణం!

» రాజకీయాలకు అతీతమైన బంధం!

» రాహుల్ అజెండాపై నమ్మకం

» సోనియా జీవితంపై సినిమా ప్రకటనతో చర్చ!

» టీకాంగ్రెస్ నేతల్లో విలక్షణ నేత జగ్గారెడ్డి

కొన్ని అభిమానాలు పదవుల కోసం పుట్టవు.. కొన్ని బంధాలు రాజకీయ అవసరాలతో ముడిపడవు. తెలంగాణ కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబం పట్ల తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని మాటల్లోనే కాదు.. చేతల్లోనూ చూపిస్తున్న నాయకుడు జగ్గారెడ్డి. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఏ ఉద్యమానికి పిలుపునిచ్చినా.. సంగారెడ్డిలో దాని ప్రతిధ్వని వినిపించాల్సిందే! ఢిల్లీలో సభ జరిగితే సంగారెడ్డిలో ఎల్ ఈడీ తెరలు వెలగాలి.. ఓటు హక్కు పరిరక్షణకు పిలుపిస్తే ప్రజల మధ్య బ్యాలెట్ బాక్సులు తిరగాలి.. కార్యకర్తలకు పిలుపిస్తే బస్సులు ఢిల్లీ బాట పట్టాలి! ఇదీ జగ్గారెడ్డి రాజకీయ శైలి. అంతటితో ఆగలేదు.. సోనియా గాంధీ జీవితాన్నే వెండితెరపై ఆవిష్కరిస్తానంటూ సంచలన ప్రకటన చేశారు. కంగనా రనౌత్ విమర్శలకు మాటలతోనే కాదు.. చరిత్రను సినిమాగా చూపిస్తానంటూ సవాల్ విసిరారు. ఇందిర నుంచి రాజీవ్ వరకు.. సోనియా నుంచి రాహుల్, ప్రియాంక వరకు గాంధీ కుటుంబ రాజకీయ ప్రయాణాన్ని ప్రజలకు పరిచయం చేయాలన్నది ఆయన సంకల్పం. అసలు గాంధీ కుటుంబంపై జగ్గారెడ్డికి ఇంతటి మమకారం ఎందుకు? రాహుల్ నాయకత్వంపై ఆయనకు ఎందుకింత నమ్మకం? తెలంగాణ కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబానికి ప్రహరీలా నిలవాలనుకుంటున్నారా? జగ్గారెడ్డి మనసులోని రాజకీయ అనుబంధం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది.


భగవద్గీత సమగ్ర జీవన శాస్త్రం!

- మత గ్రంథం కాదు.. మానవాళికి మార్గదర్శి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

భగవద్గీత కేవలం మత గ్రంథం కాదని, మానవ జీవితానికి మార్గదర్శనం చేసే సమగ్ర జీవన శాస్త్రమని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో డాక్టర్ శ్రీనాథన్ రచించిన 'భగవద్గీత ఇన్ ది లెన్స్ ఆఫ్ న్యూరోసైన్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆధునిక న్యూరోసైన్స్ కోణంలో గీతా సందేశాన్ని విశ్లేషించడం అభినందనీయమన్నారు. ఒత్తిడి, భయం, కోపం, ఆందోళనలను నియంత్రించుకోవడానికి గీతలో మార్గదర్శనం ఉందని తెలిపారు. వేదాలు, భగవద్గీత ఎప్పటికీ ఆధునికమైనవేనని, భవిష్యత్ తరాలకు సైతం మార్గదర్శకంగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు. గీత విలువను గుర్తించినకుహనా



లౌకికవాదులపై విమర్శలు చేశారు. (వివరాలు 3లో..)



హైదరాబాద్ సీపీగా సజ్జనార్ వీడ్కోలు!

ఏడాది ప్రయాణానికి భావోద్వేగ ముగింపు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏడాది కాలం తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని ప్రయాణమని సజ్జనార్ భావోద్వేగంగా వెల్లడించారు. చారిత్రక హైదరాబాద్ నగరానికి సేవ చేసే అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. (వివరాలు 3లో..)



3లో..

నాతో చర్చకు రండి

ప్రధానికి రాహుల్ ఏడోసారి సవాల్

ట్యాపింగ్ బాంబు పేల్చిన కాంగ్రెస్ అగ్రనేత

ప్రధాని నరేంద్ర మోదీతో ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. తనతో ముఖాముఖి చర్చకు వస్తే మోదీ రాజకీయ జీవితం ముగుస్తుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ' కార్యక్రమంలో మాట్లాడిన ఆయన..ప్రధాని తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు.

పెట్టుబడులకు తెలంగాణే స్వర్గధామం!

» పరిశ్రమలకు పూర్తి సహకారం.. ఉపాధికి భరోసా

» ప్రపంచ పారిశ్రామికవేత్తలకు శ్రీధర్ బాబు ఆహ్వానం

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. పరిశ్రమల స్థాపనకు, వ్యాపార విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. ప్రపంచ పారిశ్రామికవేత్తలకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ భరోసా ఇచ్చారు. హైదరాబాద్ హెచ్‌బీసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ 2026 వేదికగా శుక్రవారం భారత్‌తో పాటు విదేశాలకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలు,



కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న సంస్థల విస్తరణపై చర్చించారు. టర్కీ, కెనడా, దక్షిణాఫ్రికా, బ్రిటన్, అమెరికా ప్రతినిధులు కూడా ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మంత్రి వివరించారు. (వివరాలు 2లో..)

రాహుల్ వస్తే.. నెప్పేంటి?

- భారత్ సమ్మిట్‌కు రాకపై కాక
- బీజేపీకి సీఎం రేవంత్ కౌంటర్



ఆయన రాకను రాజకీయ కోణంలో చూడటం సరికాదని, సమ్మిట్‌లో వచ్చే సూచనలను భవిష్యత్తులో జాతీయ విధానాల రూపకల్పనకు ఉపయోగించుకుంటామని చెప్పారు.

నెహ్రూ నుంచి వాజ్‌పేయి వరకు అదే సంప్రదాయం

రాహుల్ పాల్గొనడంపై బీజేపీ చేస్తున్న విమర్శలకు చరిత్రను ఉదాహరణగా చూపుతూ రేవంత్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. దేశ ప్రయోజనాల విషయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సహకారం కొత్తేమీ కాదన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు వామపక్ష, దక్షిణపక్ష భావజాలాల మధ్య వారధిగా అలీనోద్యమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రధానులంతా తమదైన పద్ధతుల్లో ఈ సంప్రదాయాన్ని కొనసాగించారని చెప్పారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయిని విదేశీ ప్రతినిధి బృందంలో భాగస్వామిని చేశారని వివరించారు. దేశ ప్రయోజనాల కోసం రాజకీయ విభేదాలను పక్కనపెట్టడం భారత ప్రజాస్వామ్య సంప్రదాయమని స్పష్టం చేశారు.

పెట్టుబడులే లక్ష్యం.. విమర్శలకు చెక్

నవంబర్ 13, 14 తేదీల్లో జరుగుతున్న 48 గంటల భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి దాదాపు వెయ్యి మంది ప్రతినిధులు, నిపుణులు హాజరయ్యారని సీఎం తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ప్రజాస్వామ్య అంశాలపై చర్చించి రూపొందించే తీర్మానాలను తెలంగాణలో అమలు చేస్తామని వెల్లడించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ముందు రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యమన్నారు. మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూల వాతావరణం తెలంగాణ బలాలని వివరించారు. బెంగళూరు, చెన్నై, ఢిల్లీలో ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు నిర్వహించామని, ముంబై, అహ్మదాబాద్‌లోనూ నిర్వహిస్తామని చెప్పారు. మరోవైపు, వీసాలు పొందిన కొందరు విదేశీ ప్రతినిధులు భారత్‌కు బయలుదేరిన తర్వాత చివరి నిమిషంలో కేంద్ర ప్రభుత్వం వీసాలు రద్దు చేసి వారి పర్యటనకు ఆటంకం కలిగించిందని ఆరోపించారు. తెలంగాణకు మేలు చేసే కార్యక్రమాలను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమ్మిట్‌ను వ్యతిరేకిస్తున్నారని, ప్రభుత్వ నిధుల వృథా అంటూ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధి, ప్రపంచ పెట్టుబడుల ఆకర్షణే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



ఎల్‌నినో దెబ్బ

కేంద్రం సాయం కోరనున్న తెలంగాణ!
రైతుల కోసం ఢిల్లీకి సీఎం బృందం
నవంబర్ 15న మోదీతో రేవంత్ భేటీ

అందించాలని కేంద్రాన్ని కోరనున్నారు. ముఖ్యంగా వర్షాలు సరిగా కురవకపోవడంతో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధానికి వివరించనున్నారు.

కరువు నివారణకు ఆర్థిక చేయూత

రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో తలెత్తుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరనున్నారు. వర్షాభావంతో నష్టపోతున్న రైతులకు సకాలంలో ఉపశమనం కల్పించడం, కరువు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడం ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితిని కేంద్రానికి వివరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కరువు నివారణ కార్యక్రమాలకు అదనపు ఆర్థిక పనరులు అవసరమని తెలియజేయనున్నారు.

కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో చర్యలు

వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి బృందం ప్రధానితో చర్చించనుంది. రైతుల ప్రయోజనాలను కాపాడటం, వ్యవసాయ రంగానికి అండగా నిలవడం, గ్రామీణ కుటుంబాలకు సకాలంలో సహాయం అందించడం లక్ష్యంగా ప్రతిపాదనలు వివరించనున్నారు. కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కేంద్ర సహకారం, తగిన ఆర్థిక సాయం సాధించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే చర్యలకు కేంద్రం నుంచి అవసరమైన మద్దతు లభిస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తోంది.

ఈ మేరకు నవంబర్ 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రధానిని కలవనున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించి, కరువు నివారణ చర్యలకు అవసరమైన ఆర్థిక సహాయం

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్!

- ముగింపు దశకు విచారణ
- సంచలనాలు ఖాయమన్న సీఎం



ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలోనే విచారణ ముగియనుందని, అనేక సంచలన విషయాలు వెలుగులోకి రాబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఈ కేసుపై నవంబర్ 13న హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఫోన్‌ను ప్రధాని మోదీ ట్యాప్ చేయిస్తున్నారంటూ ఆరోపించిన నేపథ్యంలో, మీ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురవుతోందా అని మీడియా ప్రతినిధులు సీఎంను ప్రశ్నించారు. దీనికి స్పందించిన రేవంత్ రెడ్డి తన ఫోన్ ట్యాప్ చేసినా ఎలాంటి అభ్యంతరం లేదని, తన ఫోన్‌లో వినడానికి అభ్యంతరకరమైన విషయాలేవీ లేవని స్పష్టం చేశారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముగింపు దశకు చేరుకుందన్న ఆయన ప్రకటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగింది?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో కేంద్రంగా ప్రతిపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, న్యాయమూర్తులు, ప్రముఖుల ఫోన్లు అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై 2024 మార్చిలో హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించింది. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన అధికారులు పలువురు నిందితులు, సాక్షులను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా సాక్షులుగా విచారణను ఎదుర్కొన్నారు. ఇప్పటికే పలువురు రాజకీయ ప్రముఖుల పాత్రపై ఆరా తీసిన సిట్ కీలక ఆధారాలను సేకరించింది.

ప్రధాని మోదీ భేటీ నుంచి సెటైర్ల వరకు

ఎల్లుండి ప్రధాని నరేంద్ర మోదీతో జరగనున్న భేటీ ఖేలో ఇండియా పోటీలకు ఆహ్వానించేందుకేనని రేవంత్ రెడ్డి వెల్లడించారు. మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటామన్న బీఆర్ఎస్ హెచ్చరికలపై తీవ్రంగా స్పందిస్తూ, గతంలో ల్యాంకో హిల్స్, పద్మాలయ భూముల విషయంలో ఉద్యమం పేరుతో రాద్ధాంతం చేసి, అధికారంలోకి వచ్చాక మౌనం వహించారని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత ఇంటిపై డ్రోన్ ఎగరేసిన వ్యవహారం తనకు తెలియదని, అది వారి కుటుంబ వ్యవహారమని వ్యాఖ్యానించారు. కేటీఆర్ గడ్డంపై కూడా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మరోవైపు భారత్ సమిట్‌కు బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను ఎందుకు ఆహ్వానించలేదో వివరిస్తూ, గతంలో ఇన్వెస్ట్ తెలంగాణ కార్యక్రమానికి పిలిచినా వారు రాలేదన్నారు. కిషన్‌రెడ్డి వస్తానంటే తానే స్వయంగా వెళ్లి ఆహ్వానిస్తానని తెలిపారు. భారతీయుల ఆత్మ కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యానిస్తూ బీజేపీ భవిష్యత్తుపైనా విమర్శలు గుప్పించారు.

లక్ష కోట్ల భూములు ఎక్కడికి పోతున్నాయ్?

ట్రక్ పార్క్ వేలంపై హరీశ్ రావు ఆరోపణలు

రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూములు అమ్మడం తప్ప ప్రజలకు చేసిన మంచి పని ఒక్కటీ లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటివరకు దాదాపు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే అంగుళం భూమి కూడా అమ్మబోమని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు భూములు మిగలకుండా వేలం వేస్తోందని మండిపడ్డారు. భూముల అమ్మకాలపై రేవంత్ రెడ్డి మాటలు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు బొందల గడ్డకు కూడా స్థలం ఉండదని మాట్లాడిన నాయకులు.. ఇప్పుడు కైతలాపూర్‌లో శ్మశానవాటిక స్థలాన్ని సైతం చదును చేస్తున్నారని విమర్శించారు.

పేదల భూములు అమ్మే అధికారం ఎవరిచ్చారు?

మూసాపేట, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని భూములను 1982లో ఎస్సీ, ఎస్టీ, పేద రైతుల నుంచి సేకరించి ప్రజా అవసరాలకే వినియోగిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తుచేశారు. ఈ మేరకు న్యాయస్థానాల్లో అఫిడవిట్లు కూడా దాఖలు చేశారని తెలిపారు. అలాంటప్పుడు ఇప్పుడు ఎకరం రూ.100 కోట్లకు ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. ప్రజా అవసరాలకు వినియోగించకపోతే ఆనాడు భూములిచ్చిన పేద రైతులకే తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేదంటే సుమారు 10 లక్షల మంది జనాభా అవసరాల కోసం అక్కడ ఆసుపత్రి, పార్కు నిర్మించాలని సూచించారు. ప్రజల కోసం కేటాయించిన భూములను వ్యాపార ప్రయోజనాలకు మళ్లించడం అన్యాయమని మండిపడ్డారు.



వేలంలో పాల్గొంటే నష్టపోతారు!

మూసాపేట ట్రక్ పార్క్ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి హరీశ్ రావు క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానిక ప్రజలు, ట్రక్ డ్రైవర్లు, కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ధర్నాలో పాల్గొని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ట్రక్ పార్క్ భూముల వేలంలో ఎవరూ పాల్గొనవద్దని, కొనుగోలు చేసినా భవిష్యత్తులో అనుమతులు రావని హెచ్చరించారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనాలకే వినియోగిస్తామని ప్రకటించారు. వేలంలో పాల్గొని పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని కొనుగోలుదారులకు సూచించారు. ట్రక్ పార్క్ భూముల వేలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని, స్థానిక ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులే తప్ప అమ్మకానికి పెట్టే సరుకులు కావని హరీశ్ రావు స్పష్టం చేశారు.

వంద కోట్లతో ప్రచార ఆర్భాటమా?

- ప్రజా సమస్యలపై రాహుల్ మౌనం?
- భారత్ సమ్మిట్‌పై కేటీఆర్ ప్రశ్నల వర్షం



తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు భారత్ సమ్మిట్ పేరుతో ప్రచార కార్యక్రమానికి వస్తారా? తెలంగాణ ప్రజల సొమ్ము రూ.100 కోట్లు ఖర్చు చేసి నిర్వహిస్తున్న కార్యక్రమం ద్వారా ఎవరికి ప్రయోజనం కల్పించాలనుకుంటున్నారు? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు, మహిళలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించని రాహుల్.. సమ్మిట్ వేదికపై సందేశాలు ఇవ్వడానికి రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలకు సమాధానం చెప్పకుండా అంతర్జాతీయ వేదికలపై ప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వడమేంటని కాంగ్రెస్ నాయకత్వాన్ని నిలదీశారు.

నిరుద్యోగులు, గిరిజనుల సమస్యలపై ప్రశ్నలు

ఉద్యోగాల హామీ అమలు చేయాలని నిరసన తెలిపిన నిరుద్యోగ విద్యార్థులపై పోలీసుల చర్యలు జరిగినప్పుడు రాహుల్ గాంధీ ఎక్కడున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. లగచర్లలో గిరిజన మహిళలు ఎదుర్కొన్న ఇబ్బందులు, హైడ్రా కూల్చివేతలతో నిరాశ్రయులైన పేద కుటుంబాల పరిస్థితులపై ఎందుకు స్పందించలేదని నిలదీశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత, పర్యావరణ విధ్వంసం ఆరోపణలు, కేటీఆర్ పార్కు పరిసరాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై కూడా కాంగ్రెస్ అగ్రనేత మౌనం వహించారని విమర్శించారు.

రైతులు, చేనేత కార్మికుల కన్నీళ్లు కనిపించలేదా?

రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల బలవన్మరణాలు, భూకబ్జాల ఆరోపణలు, జర్నలిస్టుల అరెస్టులు జరిగినప్పుడు రాహుల్ గాంధీ ఎందుకు స్పందించలేదని కేటీఆర్ ప్రశ్నించారు. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్న వ్యవహారంపై కూడా ఆయన మౌనంగా ఉన్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎదుట మహిళా ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయని ఆరోపణలు వచ్చినప్పుడు కూడా స్పందించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌లోని ఎమ్మెల్యేలు, మంత్రులే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నా వాటిపై అధిష్ఠానం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

సమ్మిట్‌కు ముందు సమాధానాలు చెప్పాలి

తెలంగాణ ప్రజల సమస్యలు పరిష్కరించకుండా వంద కోట్ల ప్రజాధనంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు. సమ్మిట్ ద్వారా పెట్టుబడులు, అభివృద్ధి గురించి మాట్లాడే ముందు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలకు మరో వేదికగా మారాయి. అయితే రూ.100 కోట్ల వ్యయం, ప్రభుత్వ విధానాలపై కేటీఆర్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సి ఉంది.

సిద్దిపేటలో హరీశ్‌కు కవిత సవాల్!

- అవినీతి ఆరోపణలతో రాజకీయ సమరం
- ప్రజల్లోకి వెళ్దాం.. టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం



సిద్దిపేటలో రాజకీయ పోరుకు సిద్ధమయ్యానని, రాబోయే ఎన్నికల్లో అక్కడ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మాజీ మంత్రి హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను ప్రజాజీవితం నుంచి తప్పించే వరకు పోరాడతామని వ్యాఖ్యానించారు. శుక్రవారం సిద్దిపేట రంగధాంపల్లి చౌరస్తాలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్మాణాల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రూ.6 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన మల్లన్నసాగర్ ప్రాజెక్టు రూ.9 వేల కోట్లకు చేరిందని, నిర్వాసితులకు న్యాయం జరగలేదని విమర్శించారు. కొండపోచమ్మ సాగర్ పనుల్లోనూ డిజైన్లు మార్చి రూ.1,700 కోట్ల అదనపు భారం మోపారని ఆరోపించారు.

నిమ్స్‌లో వంద కోట్ల కుంభకోణం?

ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో నిమ్స్‌లో రూ.100 కోట్ల అవినీతి జరిగిందని, తన వద్ద ఆధారాలు ఉన్నాయని కవిత పేర్కొన్నారు. గవర్నింగ్ కౌన్సిల్ అనుమతి లేకుండా రూ.25 కోట్లు ఇతర ఖాతాలకు మళ్లించారని ఆరోపించారు. బొగ్గు సరఫరా, ఆలయ భూములు, రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలింపు వ్యవహారాల్లోనూ అక్రమాలు జరిగాయని విమర్శించారు. హరీశ్ రావు ఆస్తుల వివరాలపై ప్రశ్నలు సంధించారు. ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిలో తనకు పైసా సంబంధం లేదని స్పష్టం చేశారు.

అధికారమే లక్ష్యం.. అభివృద్ధే ఎజెండా

తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం కోసం రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో సాగునీరు అందలేదని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఐదు ప్రధాన అంశాలతో పాంచజన్యం కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల నుంచే తమ రాజకీయ పోరాటం ప్రారంభమవుతుందని ప్రకటించారు. తొలుత కోటిలింగేశ్వర ఆలయంలో పూజలు చేసిన కవిత, అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి పార్టీ కార్యాలయానికి భూమిపూజ చేశారు.

పెట్టుబడులకు తెలంగాణే స్వర్గధామం!



అన్ని రంగాల్లో అపార అవకాశాలు

మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఐటీఈఎస్, ఖనిజాలు, టెలికాం, మొబైల్ తయారీ, ఇంజినీరింగ్, పట్టణ రవాణా, బ్యాటరీ సెల్ టెక్నాలజీ, ఇంధన నిల్వ వంటి రంగాల్లో పెట్టుబడులపై చర్చలు జరిగాయి. ఔషధ తయారీ, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు, వాణిజ్య సౌలభ్యంపైనా కంపెనీల ప్రతినిధులు ఆసక్తి చూపారు. తెలంగాణలో బలమైన పారిశ్రామిక మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన యువత, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు ఉన్నాయని శ్రీధర్ బాబు వివరించారు. సంప్రదాయ పరిశ్రమలతో పాటు ఆధునిక సాంకేతిక రంగాల్లోనూ రాష్ట్రానికి మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కొత్త యూనిట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు తమ వ్యాపారాన్ని విస్తరించాలని కోరారు.

పెట్టుబడుల నుంచి ఉద్యోగాల సృష్టి

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడులను పరిశ్రమలుగా.. పరిశ్రమలను ఉద్యోగ అవకాశాలుగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తూ తెలంగాణను పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్ రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రపంచ పెట్టుబడులకు స్వాగతం పలుకుతూ తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ సంస్థలను భాగస్వాములను చేయడమే ఈ భేటీల ప్రధాన ఉద్దేశం.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా!

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి బీమా రక్షణ అందించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దేశంలోనే ప్రతి కుటుంబానికి సార్వత్రిక జీవిత బీమా కల్పిస్తున్న తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలవబోతోందని వెల్లడించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' నమోదు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. కుటుంబంలో ఉపాధి పొందుతున్న వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. గతంలో అమలైన బీమా పథకాలు కొన్ని శాఖలు, నిర్దిష్ట వర్గాలకే పరిమితమయ్యాయని, ఇప్పుడు ప్రతి కుటుంబానికి రక్షణ కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు.

కుటుంబాలకే నామినీ ఎంపిక అధికారం

ఈ పథకంలో ప్రతి కుటుంబానికి ఒక ఉపాధి పొందే వ్యక్తికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుంది. ఒక కుటుంబంలో పలువురు ఉపాధి పొందుతున్నట్లయితే వారిలో ఎవరికి బీమా కల్పించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకునే నామినీలకు ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలన్నది కూడా కుటుంబమే నిర్ణయించుకోవచ్చు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 19 నుంచి గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఒకేసారి నమోదు ప్రక్రియ చేపట్టి అర్హులైన ప్రతి కుటుంబాన్ని పథకంలో చేర్చాలని సూచించారు.

నమోదు నుంచి ప్రచారం వరకు పక్కా ఏర్పాట్లు

లబ్ధిదారుల పేర్లు, నామినీల వివరాల నమోదులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. నమోదు చేసిన వివరాలను సంతకం తీసుకునే ముందే కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నవంబర్ 17, 18 తేదీల్లో గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. నమోదు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే ప్రజలకు తెలియజేయాలని, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలిచేలా ప్రతి ఇంటికీ జీవిత బీమా భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

ప్రపంచానికి శాంతి, సమానత్వమే దిక్సూచి

- భారత్ సమ్మిట్ వేదికగా భట్టి విక్రమార్క సందేశం

గాంధీ ఆశయాలకు ప్రత్యేక ప్రదర్శన

హైదరాబాద్ వేదికగా ప్రారంభమైన భారత్ సమ్మిట్ 2026 ప్రపంచ దేశాల ప్రతినిధులను ఒకచోట చేర్చి సామాజిక న్యాయం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధిపై చర్చలకు వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రివర్గ సహచరులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభించారు. భారతదేశ దౌత్య చరిత్రతో పాటు మహాత్మా గాంధీ అనుసరించిన శాంతి, అహింస, మానవీయ విలువలను ప్రతిబింబించేలా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ప్రపంచానికి గాంధీజీ అందించిన సందేశాన్ని మరోసారి గుర్తుచేసేలా ఈ కార్యక్రమం సాగింది.

సోనియా గాంధీ పుస్తకంపై ఆసక్తి

అనంతరం పుస్తక ప్రదర్శనను సందర్శించిన భట్టి విక్రమార్క, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రచించిన 'బిలోంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని పరిశీలించారు. ఈ సమ్మిట్ ప్రపంచ దేశాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, న్యాయం, సమానత్వం, మానవ గౌరవం ఆధారంగా మెరుగైన ప్రపంచ నిర్మాణానికి బాటలు వేయాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయ, భౌగోళిక విభేదాలకు అతీతంగా మానవత్వమే అందరినీ కలిపే శక్తిగా నిలవాలని భట్టి విక్రమార్క సందేశమిచ్చారు. ప్రపంచ శాంతికి మాటలు మాత్రమే కాదు.. ప్రజాస్వామ్య విలువల ఆచరణ కూడా అవసరమన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం.



నాతో చర్చకు రండి

- ప్రధానికి రాహుల్ ఏడోసారి సవాల్
- ట్యాపింగ్ బాంబు పేల్చిన కాంగ్రెస్ అగ్రనేత



ప్రధాని నరేంద్ర మోదీతో ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. తనతో ముఖాముఖి చర్చకు వస్తే మోదీ రాజకీయ జీవితం ముగుస్తుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ' కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ప్రధాని తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. "నా ఫోన్‌లోనే మోదీకి వ్యతిరేకంగా అన్ని ఆధారాలు ఉన్నాయి. ఆయనకు కూడా ఈ విషయం తెలుసు. ఎందుకంటే నా ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారు" అంటూ తన ఫోన్‌ను కెమెరా ముందు చూపించారు. అయితే, ఈ ఆరోపణలకు మద్దతుగా ఎలాంటి సాంకేతిక ఆధారాలను ఆయన బయటపెట్టలేదు.

ఏడోసారి చర్చకు రాహుల్ పిలుపు

గత 12 రోజుల్లో ఏడోసారి మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్ విసరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల ప్రక్రియ, విదేశీ జోక్యం, జాతీయ భద్రత వంటి అంశాలపై ప్రజల సమక్షంలో చర్చ జరగాలని ఆయన కోరుతున్నారు. దేశానికి ఎవరు నిజమైన దేశభక్తులో, ఎవరు దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారో చర్చలో తేలిపోతుందని అన్నారు. దీపావళి సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలోనూ టెలీప్రాంప్టర్ అవసరమైందంటూ మోదీపై విమర్శలు చేశారు. చర్చకు మోదీ టెలీప్రాంప్టర్‌తో వచ్చినా తనకు అభ్యంతరం లేదని, న్యాయనిర్ణేతను కూడా ఆయన ఇష్టానుసారం ఎంచుకోవచ్చని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

పెగాసస్ ఆరోపణలపై పాత వివాదం

గతంలోనూ తనతో పాటు పలువురు రాజకీయ నాయకుల ఫోన్లలో పెగాసస్ నిఘా సాఫ్ట్‌వేర్ ఉందని రాహుల్ ఆరోపించారు. నిఘా అధికారులు ఫోన్‌లో మాట్లాడే విషయాలపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినట్లు 2023లో వెల్లడించారు. అయితే, ఈ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. తాజా వ్యాఖ్యలపైనా బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పార్లమెంట్‌లోనే చర్చకు అవకాశం ఉందని, బయట వేదికల కోసం రాహుల్ పట్టుబట్టడం ఎందుకని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో ప్రశ్నించారు. మోదీ చర్చకు రావాలని రాహుల్ పట్టుబడుతుండగా, బీజేపీ నేతలు ఆయన సవాళ్లను కొట్టిపారేస్తున్నారు. ఈ మాటల యుద్ధం రాజకీయంగా మరింత వేడెక్కుతోంది.

ప్రేమ వలలో టెక్ దిగ్గజం



- హనీ ట్రాప్ అంటే ఏమిటి?
- ప్రేమ, పరిచయం, బ్లాక్‌మెయిల్
- గూఢచారుల ప్రమాదకర వ్యూహం
- చైనా గూఢచర్యం వెనుక అసలు కథ!
- జెన్సన్ హువాంగ్ ఎలా చిక్కుకున్నారు?

ప్రపంచ టెక్నాలజీ రంగాన్ని శాసించే దిగ్గజం.. లక్షల కోట్ల విలువైన వ్యాపార సామ్రాజ్యానికి నాయకత్వం వహిస్తున్న అధినేత.. అలాంటి వ్యక్తి చుట్టూ ఒక్కసారిగా గూఢచర్యం నీడలు కమ్ముకుంటే? అదీ ప్రేమ పేరుతో పన్నిన వలలో చిక్కుకున్నారనే ఆరోపణలు తెరపైకి వస్తే? ఇప్పుడు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తున్న కథ ఇదే! ఎన్విడియా అధినేత జెన్సెన్ హువాంగ్ చుట్టూ తిరుగుతున్న ఈ వ్యవహారం సాధారణ వ్యక్తిగత వివాదం కాదు. ఓ మహిళతో సంబంధాల ఆరోపణలు, సింగపూర్‌లోని ఓ టెక్నాలజీ సంస్థతో వ్యాపార లావాదేవీలు, చైనాకు సంబంధించిన గూఢచర్య అనుమానాలు.. అన్నీ కలిసిపోతూ ప్రపంచ టెక్ రంగంలో కలకలం రేపుతున్నాయి. ప్రేమ ఒక వ్యక్తిగత బలహీనతగా మారిందా? వ్యాపార పరిచయాల వెనుక రహస్య లక్ష్యాలున్నాయా? అత్యాధునిక చిప్‌ల సమాచారం, అంతర్జాతీయ టెక్నాలజీ ఆధిపత్యం లక్ష్యంగా భావోద్వేగాలనే ఆయుధంగా ఉపయోగించారా? యుద్ధాలు ఎప్పుడూ సరిహద్దుల్లోనే జరగవు.. కొన్నిసార్లు అవి ప్రేమ పేరుతో మొదలై, నమ్మకాన్ని దాటి, దేశాల భద్రతను తాకుతాయి. అసలు ఈ కథలో నిజమెంత? ఆరోపణల వెనుక దాగిన అంతర్జాతీయ వ్యూహమేంటి? లోతుగా పరిశీలిస్తే బయటపడే ఆసక్తికర అంశాలెన్నో!

ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన టెక్నాలజీ సంస్థల్లో ఒకటైన ఎన్విడియా అధినేత జెన్సన్ హువాంగ్ చుట్టూ హనీ ట్రాప్ వివాదం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా తెలుసుకోవాలి. జెన్సన్ హువాంగ్ వివాహేతర సంబంధం ఉన్నట్లు అంగీకరించినట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆయనను చైనా గూఢచారులు పక్కా ప్రణాళికతో హనీ ట్రాప్‌లోకి దించారనే విషయం ఇంకా నిరూపితం కాలేదు. ఆయనతో సంబంధం ఉన్నట్లు వార్తల్లో పేర్కొన్న ఆలిస్ హువాంగ్ అనే మహిళను చైనా నిఘా వ్యవస్థతో సంబంధాలున్న వ్యక్తిగా అమెరికా అధికారులు అనుమానిస్తున్నట్లు కథనాలు వచ్చాయి. ఈ ఆరోపణలను చైనా తోసిపుచ్చింది. ఎన్విడియా బోర్డు కూడా ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ ప్రారంభించినట్లు వార్తలు వెలువడ్డాయి. కంపెనీ రహస్యాలు లేదా అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారం బయటకు వెళ్లినట్లు తమకు ఆధారాలు లేవని సంస్థ తెలిపింది. అసలు హనీ ట్రాప్ ఎలా పని చేస్తుంది? ప్రపంచ స్థాయి వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, సైనికాధికారులు సైతం ఇలాంటి వలలో ఎలా చిక్కుకుంటారు? ఈ వివాదం మరోసారి అంతర్జాతీయ గూఢచర్య వ్యూహాలపై ఆసక్తిని పెంచింది.

అసలు హనీ ట్రాప్ అంటే ఏమిటి?

హనీ ట్రాప్ అంటే ప్రేమ, ఆకర్షణ, సాన్నిహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని ఒక వ్యక్తి నుంచి రహస్య సమాచారాన్ని సేకరించే గూఢచర్య పద్ధతి. ఇందులో గూఢచారులు ముందుగా తమ లక్ష్యాన్ని గుర్తిస్తారు. అతని బలహీనతలు, అలవాట్లు, వ్యక్తిగత జీవితం, ఇష్టాయిష్టాలపై సమాచారం సేకరిస్తారు. ఆ తర్వాత పరిచయం పెంచుకుంటారు. స్నేహం ప్రేమగా మారేలా చేస్తారు. నమ్మకం ఏర్పడిన తర్వాత వ్యక్తిగత విషయాలు, వ్యాపార రహస్యాలు, కీలక సమాచారం రాబట్టేందుకు ప్రయత్నిస్తారు. కొన్నిసార్లు సన్నిహిత ఫొటోలు, వ్యక్తిగత సంభాషణలను సేకరించి బ్లాక్‌మెయిల్‌కు ఉపయోగిస్తారు. మరికొన్ని సందర్భాల్లో ఎలాంటి బెదిరింపులు లేకుండానే భావోద్వేగ బంధం ద్వారా సమాచారం పొందుతారు. ఇక్కడ ప్రేమ నిజమా, నటనా అన్నది బాధితుడికి తెలియకపోవడమే గూఢచారులకు ప్రధాన అవకాశం. సోవియట్ రష్యా నిఘా సంస్థ కేజీబీ మహిళా ఏజెంట్లను ఉపయోగించగా, తూర్పు జర్మనీ స్టాసీ సంస్థ మహిళలకు దగ్గరయ్యేలా పురుష గూఢచారులను నియమించింది. వీరిని రోమియో స్పైస్ అని పిలిచేవారు.

జెన్సన్ హువాంగ్ ఎలా పరిచయంలోకి వచ్చారు?

ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆలిస్ హువాంగ్. ఆమె జెన్సన్ హువాంగ్‌కు బంధువు కాదు. సింగపూర్‌కు చెందిన మెగాస్పీడ్ ఇంటర్నేషనల్ అనే డేటా సెంటర్ సంస్థలో గతంలో కీలక బాధ్యతలు నిర్వహించిన వ్యాపారవేత్త. ఆ సంస్థ ఎన్విడియాకు వ్యాపార భాగస్వామిగా ఉండటంతో ఆమెకు జెన్సన్‌తో పరిచయం ఏర్పడినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. తైవాన్‌లో జరిగిన కొన్ని కార్యక్రమాలు, విందుల్లో ఇద్దరూ కలిసి కనిపించిన ఫొటోలు కూడా వెలుగులోకి వచ్చాయి. వ్యాపార పరిచయం క్రమంగా వ్యక్తిగత సాన్నిహిత్యంగా మారినట్లు వార్తలు వచ్చాయి. జెన్సన్ తన భార్యకు ద్రోహం చేశానని నవంబర్ 8న ఎన్విడియా ఉద్యోగులకు పంపిన సందేశంలో అంగీకరించి క్షమాపణలు చెప్పారు. అయితే ఈ సంబంధం ఎప్పుడు ప్రారంభమైంది? ఎంతకాలం కొనసాగింది? ఆలిస్ ఉద్దేశపూర్వకంగా ఆయనకు దగ్గరయ్యారా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు లేవు.

ప్రేమ వెనుక చిప్స్ వ్యాపార రహస్యాలా?

ఈ వ్యవహారం కేవలం వ్యక్తిగత సంబంధానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆలిస్ పనిచేసిన మెగాస్పీడ్ సంస్థకు ఎన్విడియా చిప్స్ కొనుగోలు చేసే అవకాశం ఉండటం అమెరికా నిఘా సంస్థల అనుమానాలకు కారణమైంది. అత్యాధునిక ఏఐ చిప్స్ చైనాకు అక్రమంగా చేరుతున్నాయా? వాటి సరఫరా వ్యవస్థలో ఆలిస్ పాత్ర ఏమిటి? అనే అంశాలపై దర్యాప్తు సాగుతోంది. కొన్ని అంతర్జాతీయ నివేదికల ప్రకారం, ఆలిస్ చైనా నిఘా సంస్థలకు సమాచారం చేరవేస్తున్నారని అమెరికా అధికారులు అనుమానించారు. చైనాకు చెందిన సంస్థలతో వ్యాపార సంబంధాలు, చిప్స్ సరఫరా వ్యవహారాలు కూడా ఈ వివాదంలో భాగమయ్యాయి. ఎన్విడియా రహస్యాలు లేదా అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారం బయటకు వెళ్లిందని నిర్ధారణ కాలేదు. ఎన్విడియా బోర్డు స్వతంత్ర విచారణ ప్రారంభించింది. మరోవైపు చైనా ప్రభుత్వం గూఢచర్య ఆరోపణలను ఖండించింది. నవంబర్ 12న అమెరికా న్యాయశాఖ కూడా ఆలిస్ చైనా గూఢచారి అని ఇంకా నిర్ధారించలేదని ప్రకటించింది. అదే రోజు జెన్సన్ హువాంగ్ ఎన్విడియా సీఈఓ పదవి నుంచి తప్పుకున్నట్లు రాయిటర్స్ వెల్లడించింది.

ఒంటరితనం.. ఆకర్షణ.. డిజిటల్ వల!

మరి ప్రపంచస్థాయి వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, సైనికాధికారులు ఇలాంటి వలలో ఎందుకు పడుతున్నారు? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానం మానవ బలహీనత. ఒంటరితనం, కొత్త పరిచయాలపై ఆసక్తి, ప్రశంసల పట్ల ఆకర్షణ, వ్యక్తిగత జీవితంలో అసంతృప్తి వంటివి హనీ ట్రాప్‌కు అవకాశాలు కల్పిస్తాయి. ఒక వ్యక్తి ఎంతటి తెలివైనవాడైనా భావోద్వేగాల విషయంలో పొరపాట్లు చేయవచ్చు. ఇప్పుడు ఈ గూఢచర్యం పద్ధతి మరింత ఆధునికంగా మారింది. హోటళ్లు, విందులు, సమావేశాలే కాదు.. ఫేస్‌బుక్, లింక్డ్ఇన్, వాట్సాప్ వంటి వేదికల ద్వారా కూడా పరిచయాలు పెంచుకుంటున్నారు. నకిలీ ఫొటోలు, ఆకర్షణీయమైన ప్రొఫైల్స్‌తో కీలక వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. భారత్‌లోనూ రక్షణ పరిశోధన సంస్థకు చెందిన శాస్త్రవేత్త ప్రదీప్ కురుల్కర్ పాకిస్థాన్ నిఘా సంస్థకు సమాచారం చేరవేశారనే ఆరోపణల కేసు ఇలాంటి డిజిటల్ పరిచయాల ప్రాధాన్యతను చూపించింది. సాంకేతికత మారినా గూఢచారుల ప్రధాన ఆయుధం మాత్రం మనిషి భావోద్వేగాలే. అయితే ప్రతి ప్రేమ సంబంధాన్ని హనీ ట్రాప్‌గా భావించలేం. దాని వెనుక గూఢచర్య ఉద్దేశం ఉందని నిరూపించే ఆధారాలు అవసరం.



భగవద్గీత సమగ్ర జీవన శాస్త్రం!

- మత గ్రంథం కాదు.. మానవాళికి మార్గదర్శి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

భగవద్గీత కేవలం మత గ్రంథం కాదని, మానవ జీవితానికి మార్గదర్శనం చేసే సమగ్ర జీవన శాస్త్రమని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో డాక్టర్ శ్రీనాథన్ రచించిన 'భగవద్గీత ఇన్ ది లెన్స్ ఆఫ్ న్యూరోసైన్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆధునిక న్యూరోసైన్స్ కోణంలో గీతా సందేశాన్ని విశ్లేషించడం అభినందనీయమన్నారు. ఒత్తిడి, భయం, కోపం, ఆందోళనలను నియంత్రించుకోవడానికి గీతలో మార్గదర్శనం ఉందని తెలిపారు. వేదాలు, భగవద్గీత ఎప్పటికీ ఆధునికమైనవేనని, భవిష్యత్ తరాలకు సైతం మార్గదర్శకంగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు. గీత విలువను గుర్తించని కుహనా లౌకికవాదులపై విమర్శలు చేశారు.

కర్మయోగమే విజయానికి మార్గం

ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించడమే కర్మయోగ సారాంశమని కిషన్ రెడ్డి వివరించారు. ఈ స్ఫూర్తితోనే వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. ప్రజాప్రతినిధులు కుటుంబ ప్రయోజనాల కంటే ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు జీవితంలోని ధర్మసంకటాలకు సమాధానాలు చూపుతాయని పేర్కొన్నారు. ఈ గ్రంథాలను తెలుగు, హిందీ భాషల్లోకి అనువదించాలని కోరారు. అనారోగ్యంతోనూ వర్చువల్‌గా పుస్తకాలను ఆవిష్కరించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాగఫణి శర్మ, సినీ నటుడు శ్రీకాంత్, జీకేఎస్ రాజా పాల్గొన్నారు.

భూగర్భ జలాలపై సర్కారు దృష్టి!

- యాసంగికి ముందే నీటి లెక్కలు
- ఎల్‌నినో ముప్పుపై కార్యాచరణ

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాలు తగ్గి భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలను కాపాడేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. యాసంగి పంటల సాగుకు ముందే ప్రతి ప్రాంతంలో నీటి లభ్యతను శాస్త్రీయంగా అంచనా వేసి, అందుకు అనుగుణంగా రైతులకు పంటల సాగుపై సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సచివాలయంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులు, నిపుణులతో భూగర్భ జలాల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం, భూగర్భ జలాల వెలికితీతను నియంత్రించడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం ఈ ప్రణాళికలో ప్రధాన అంశాలుగా ఉంటాయని వివరించారు. రాష్ట్రంలోని జలవనరులపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, వివిధ శాఖల సమన్వయంతో కార్యాచరణ అమలు చేస్తామని చెప్పారు.



వాటర్‌షెడ్‌ల వారీగా నీటి లెక్కలు

సమీక్షలో పాల్గొన్న ఐఐటీ హైదరాబాద్ అనుబంధ ఆచార్యుడు, సీఎస్ఐఆర్ నిపుణుడు ప్రొఫెసర్ వీరేంద్ర తివారీ కీలక సూచనలు చేశారు. భూగర్భ జలాల అంచనా కమిటీ (జీఈసీ) నమూనా ఆధారంగా వర్షపాత వివరాలను భూగర్భ జల నిల్వలతో పోల్చి తక్షణమే అంచనాలు రూపొందించాలని సూచించారు. ప్రాథమిక నివేదికను కొద్ది రోజుల్లోనే సిద్ధం చేయవచ్చని తెలిపారు. తెలంగాణలో మొత్తం నీటి వినియోగంలో 94 శాతానికి పైగా వ్యవసాయానికే ఖర్చవుతోందని, గృహావసరాల వాటా సుమారు 1.8 శాతమని వివరించారు. ప్రతి వాటర్‌షెడ్ పరిధిలో నీటి లభ్యత, సాగుకు అవసరమైన నీటి వివరాలను పటాల రూపంలో రూపొందించాలని సూచించారు. నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగుకు అవకాశం కల్పించాలని, కొరత ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, చిరుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. వాటి ద్వారా రైతులకు వచ్చే ఆదాయాన్ని కూడా వివరించాలని సూచించారు.

నిరంతర పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

జలవనరుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ వీరేంద్ర తివారీ ప్రతిపాదించారు. ఈ బృందం నేరుగా రాష్ట్ర నాయకత్వానికి నివేదికలు అందిస్తూ వారానికోసారి లేదా పదిహేను రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని సూచించారు. దీనిపై స్పందించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి భూగర్భ జలాల శాఖను బలోపేతం చేసేందుకు అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సామర్థ్యాన్ని పెంచే అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. తక్కువ వర్షపాతం ఉన్న ఇజ్రాయెల్ వంటి దేశాలు ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి వినియోగించుకుంటున్న విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని ఆకాంక్షించారు. వచ్చే వర్షాకాలం వరకు నీటి సంరక్షణను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉమ్మడి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వర్షాలు తగ్గినా వ్యవసాయానికి ఇబ్బందులు కలగకుండా వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పరిరక్షణకు పటిష్ఠ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

ఆటో కార్మికులకు సొంతింటి భాగ్యం!

- రెండు వేల కుటుంబాలకు ఇందిరమ్మ భరోసా
- రూ.220 కోట్లతో ఆటో నగర్ కాలనీ నిర్మాణం



నగర ప్రజల రవాణా అవసరాల కోసం నిత్యం శ్రమించే ఆటో కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. హైదరాబాద్‌లో ఆటోరిక్షా డ్రైవర్ల కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రత్యేకంగా 'ఆటో నగర్ కాలనీ' నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తొలి దశలో 2,000 ఆటో కార్మిక కుటుంబాలకు ఇళ్లు కల్పించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు శాశ్వత నివాస భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నగర జీవనంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భద్రతతో పాటు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని వివరించారు.

నాలుగు ప్రాంతాల్లో 2,000 ప్లాట్లు

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని బండ్లగూడ, గంధంగూడ, పేట్ బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మిగూడ ప్రాంతాల్లో ఈ గృహ సముదాయాలను నిర్మించనున్నారు. ఒక్కో ప్రాంతంలో 500 చొప్పున మొత్తం 2,000 ఆధునిక ఫ్లాట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.220 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇళ్ల కేటాయింపు, ఆర్థిక సహాయం, అర్హతల విషయంలో ఇప్పటికే అమల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు-టవర్స్ పథకం నిబంధనలే వర్తిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. స్థలాల లభ్యత, సాంకేతిక అంశాలు, భౌగోళిక అనుకూలతలను పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), ఆర్థిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి పేదవాడికి సొంతింటి భరోసా

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ సంకల్పమని పొంగులేటి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని గుర్తుచేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదల గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది కుటుంబ ఆత్మగౌరవానికి, భవిష్యత్తు భద్రతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగంగా అమలు చేస్తున్న ప్రభుత్వం, వివిధ వర్గాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక గృహ నిర్మాణ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. అందులో భాగంగానే ఆటో కార్మికుల కోసం ఆటో నగర్ కాలనీకి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. గుడిసెలు లేని తెలంగాణ.. ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు అనే లక్ష్యాన్ని సాధించే వరకు ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.


హైదరాబాద్ సీపీగా సజ్జనార్ వీడ్కోలు!

- ఏడాది ప్రయాణానికి భావోద్వేగ ముగింపు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏడాది కాలం తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని ప్రయాణమని సజ్జనార్ భావోద్వేగంగా వెల్లడించారు. చారిత్రక హైదరాబాద్ నగరానికి సేవ చేసే అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్న మహేష్ భగవత్‌కు అభినందనలు తెలియజేశారు. తనతో పాటు పోలీసు వ్యవస్థపై నగర ప్రజలు చూపిన ఆదరణ, సహకారం వెలకట్టలేనివని పేర్కొన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన హైదరాబాద్‌లో అన్ని పండుగలు ప్రశాంతంగా జరగడం సంతోషాన్నిచ్చిందన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా ఎన్నో సంస్కరణలు చేపట్టామని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ఆహార కల్తీని అరికట్టేందుకు 'హెచ్‌ఫాస్ట్' కార్యక్రమంతో విస్తృత తనిఖీలు నిర్వహించి, కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం బ్యాంకులు, టెలికాం శాఖలతో సమన్వయం చేస్తూ 'ఆపరేషన్ ఆక్టోపస్' ప్రారంభించామని, దీనిపై కేంద్ర హోంశాఖ నుంచి ప్రశంసలు అందడం గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రజల భద్రతకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు

బాధితులకు వేగంగా న్యాయం అందించేందుకు 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్' ఏర్పాటు చేశామని సజ్జనార్ వివరించారు. విద్యార్థులకు పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు సమాజం పట్ల బాధ్యత పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల పిల్లలతో 'డే విత్ సీపీ' కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేక అనుభూతినిచ్చిందన్నారు. నగరవాసుల చిరకాల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే విధానాన్ని అమలు చేశామని గుర్తుచేశారు. మహిళల భద్రత కోసం 'స్పందన' వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.




పోలీసు సిబ్బంది సేవలను గుర్తించేందుకు 'ఎక్స్‌ట్రా మైల్', వారి ఆరోగ్య పరిరక్షణ కోసం 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్' కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. ఈ విజయాల వెనుక ప్రతి పోలీసు ఉద్యోగి శ్రమ, అంకితభావం ఉన్నాయని స్పష్టం చేశారు.

పోలీసు కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు

హోంగార్డుల నుంచి అదనపు పోలీస్ కమిషనర్ల వరకు శాంతిభద్రతలు, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ఇతర విభాగాల్లో పనిచేసిన ప్రతి ఒక్కరికీ సజ్జనార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో సైతం కుటుంబాలను పక్కనపెట్టి విధులు నిర్వహించిన పోలీసు సిబ్బంది సేవలను కొనియాడారు. నిరంతరం మార్గనిర్దేశం చేసిన డీజీపీ, ఉన్నతాధికారులకు, ప్రతి సందర్భంలో సహకరించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు చెప్పారు. తన ప్రయాణంలో పోలీసు సిబ్బంది కుటుంబాలు కూడా కీలక పాత్ర పోషించాయని గుర్తుచేసుకున్నారు. తన సహచరులందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ ప్రజలు ఎల్లప్పుడూ సురక్షితంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ.. గుండెనిండా మధుర జ్ఞాపకాలతో హైదరాబాద్ సీపీగా వీడ్కోలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

రాహుల్‌ను విమర్శిస్తే సహించం!

- బీజేపీ, బీఆర్ఎస్‌పై పొన్నం ఫైర్



రాహుల్ గాంధీ స్థాయిని విమర్శించే అర్హత బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. దేశ ప్రజలందరూ ప్రేమతో, ఐక్యతతో ఉండాలని కోరుకునే నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. సామాజిక న్యాయం సాధన, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే ఆయన రాజకీయ లక్ష్యమని పేర్కొన్నారు. అలాంటి నాయకుడు హైదరాబాద్‌కు వస్తుంటే కొందరు తమ ఉనికిని చాటుకోవడానికి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నందుకే బీజేపీ భయపడుతోందని ఆరోపించారు. రాహుల్ ఆలోచనలు దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేలా ఉన్నాయని పొన్నం అభిప్రాయపడ్డారు.

సోనియా త్యాగాన్ని తెలంగాణ మరవదు

రాహుల్ గాంధీని విమర్శించడం మానుకుని రాజ్యాంగాన్ని ఎలా కాపాడాలి, ప్రజాస్వామ్యాన్ని ఎలా బలోపేతం చేయాలి, సామాజిక న్యాయాన్ని ఎలా సాధించాలనే అంశాలపై దృష్టి పెట్టాలని పొన్నం సూచించారు. ఈ లక్ష్యాల సాధనలో తెలంగాణ రాహుల్ గాంధీ వెంట ఉంటుందని స్పష్టం చేశారు. రాహుల్ చెప్పే ప్రతి మాటను ప్రజల్లోకి తీసుకెళ్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ పాత్రను గుర్తుచేస్తూ, తాము రాసే ప్రతి పుస్తకంలో ఆమె పేరు ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చింది ముమ్మాటికీ సోనియా గాంధీయేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు ఆమె చేసిన కృషిని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

బీసీలకు హామీలపై సమాధానం చెప్పండి

42 శాతం రిజర్వేషన్లు, లక్ష కోట్ల హామీ ఏమైంది?
రాహుల్ కు బీసీఐఎఫ్ చైర్మన్ చిరంజీవులు లేఖ

తెలంగాణ పర్యటనకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు బహిరంగ లేఖ రాశారు. 2026 నవంబర్ 14న హైదరాబాద్ లో జరిగే భారత్ సమ్మిట్ నేపథ్యంలో తెలంగాణ బీసీలకు 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని కోరారు. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం, కులగణన గురించి మాట్లాడుతున్న రాహుల్.. తెలంగాణలో ఆ హామీల అమలుపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ మేధావులతో ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించి ముఖాముఖి చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

42 శాతం రిజర్వేషన్లు ఎప్పుడొస్తాయి?





తెలంగాణలో కులగణన అనంతరం బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం రెండు బిల్లులు అసెంబ్లీలో ఆమోదించి 2025 ఏప్రిల్ లో కేంద్రానికి పంపినా పెండింగ్ లోనే ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. వాటిని తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చేందుకు రాహుల్ ఎలాంటి ప్రయత్నం చేశారని ప్రశ్నించారు. 2027 జనాభా లెక్కల్లో బీసీలకు ప్రత్యేక కుల కాలమ్, ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రకటించిన 21 హామీల అమలుపైనా నిలదీశారు.

రూ.లక్ష కోట్ల హామీ ఏమైంది?

బీసీల అభివృద్ధికి ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్న హామీకి భిన్నంగా ఇప్పటివరకు కేటాయింపులు రూ.33,116 కోట్ల స్థాయిలోనే ఉన్నాయని లేఖ ఆరోపించింది. గత రెండేళ్లలో వాస్తవ ఖర్చు సుమారు రూ.5,143 కోట్లు మాత్రమేనని పేర్కొంది. మిగిలిన హామీల అమలుకు కార్యాచరణ ప్రకటించాలని కోరింది. రాష్ట్ర మంత్రివర్గంలో 16 మందికి ఇద్దరు బీసీ మంత్రులే ఉన్నారని, ఖాళీగా ఉన్న నాలుగు మంత్రి పదవులను బీసీలతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసింది. ఖాళీ ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది.

సామాజిక న్యాయం చేతల్లో చూపాలి

కార్పొరేషన్ చైర్మన్లు, నామినేటెడ్ పదవులు, ఇతర రాజకీయ నియామకాల్లో బీసీల్లోని 130 కులాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఫోరం డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా సముచిత భాగస్వామ్యం ఉండాలని పేర్కొంది. సామాజిక న్యాయం ప్రసంగాలకే పరిమితం కాకుండా పదవుల పంపిణీలోనూ కనిపించాలని స్పష్టం చేసింది. హైదరాబాద్ పర్యటన ముగిసేలోపు బీసీ మేధావులు, సంఘాల ప్రతినిధులతో సమావేశమై ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని, హామీల అమలుకు స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని చిరంజీవులు కోరారు.

రాజమండ్రి మేయర్ పీఠంపై బీజేపీ గురి!

స్థానిక అభ్యర్థికే మేయర్ అవకాశం
గోదావరి పుష్కరాలకు కుంభమేళా ఏర్పాట్లు
మేయర్ పీఠం మాదేనంటున్న మాధవ్

రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేస్తామని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని విశ్వాసం ప్రకటించారు. శుక్రవారం రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన, మేయర్ పదవికి స్థానిక నాయకుడికే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.



పార్టీ కార్యకర్తల నుంచి సేకరించిన అభిప్రాయాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన తర్వాత అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. గత ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి వంద శాతం విజయాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కుంభమేళా తరహాలో పుష్కరాల నిర్వహణ

రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాధవ్ వెల్లడించారు. ఈ వేడుకలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు సమకూరే అవకాశం ఉందన్నారు. పుష్కరాలను కుంభమేళా తరహాలో నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం లక్ష్యంగా ఈ ప్రణాళికలు ఉన్నట్లు వివరించారు. రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం, గోదావరి పుష్కరాల నిర్వహణ అంశాలను ప్రస్తావించిన మాధవ్ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పెట్టుబడులు పెట్టండి.. ఖతార్‌కు బాబు ఆహ్వానం



ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేశారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భారత్‌లో ఖతార్ రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్‌తో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానించారు. పోర్టులు, పెట్రో కెమికల్స్, గ్రీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. వ్యవసాయం, ఆక్వా కల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల సామర్థ్యాన్ని తెలియజేశారు. అమరావతిలో ఖతార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరడంతోపాటు ఖతార్ ఎయిర్‌వేస్ విమాన సర్వీసుల విస్తరణకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. భారత్‌లో ఇప్పటికే ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులకు ఆసక్తి చూపిన ఖతార్, ఏపీలో అవకాశాల పరిశీలనకు త్వరలో అధికారిక బృందాన్ని పంపుతుందని రాయబారి వెల్లడించారు. ఇతర దేశాల్లోని ఖతార్ కంపెనీలు సైతం రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు.

తుపాను నష్టం రూ.2,484 కోట్లు



మురసు తీవ్ర తుపానుతో ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,484.43 కోట్ల ప్రాథమిక నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందానికి వెల్లడించింది. విజయవాడలో సమీక్ష నిర్వహించిన కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్, తుపాను అనంతరం కేవలం రెండు రోజుల్లోనే విద్యుత్, మొబైల్, రహదారి సేవలను పునరుద్ధరించడంపై ప్రశంసలు కురిపించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను అభినందించారు. తుపాను ప్రభావంతో 1.93 లక్షల మందికి పైగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోగా, 536 పునరావాస శిబిరాల్లో 31,080 మందికి ఆశ్రయం కల్పించారు. సుమారు 1.43 లక్షల హెక్టార్ల పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వ్యవసాయం, ఉద్యానవన రంగాలకు భారీ నష్టం వాటిల్లింది. కేంద్ర బృందం బాపట్ల, ఏలూరు జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, కేంద్రానికి నివేదిక సమర్పించనుంది.



భావితరాల కోసం భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం

హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్-2026లో మంత్రి శ్రీధర్ బాబు 'భారత్ ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి ప్రణాళికను వివరించారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెట్‌జీరో లక్ష్యంతో పర్యావరణహిత నగరంగా దీనిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు నాలుగో నగరంగా రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీ, 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడంలో కీలకం కానుందని చెప్పారు. నివాసం, విద్య, పరిశోధన, ఉపాధికి సమగ్ర వేదికగా నిర్మిస్తామన్నారు. ఏఐ, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఈవీలు, డేటా సెంటర్లు, అంతరిక్ష సాంకేతికత రంగాలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. వర్షపు నీటి సంరక్షణ, సౌర విద్యుత్, పచ్చదనం, వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. అమెజాన్ సహా పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, పెట్టుబడిదారులకు భూమి, అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం సహకరిస్తుందని భరోసా ఇచ్చారు.

పెట్టుబడుల ఒప్పందాలపై ఏటా ఆడిట్

రూ.32.49 లక్షల కోట్లకు చేరిన ప్రతిపాదనలు
ఒప్పందాల అమలుపై నిరంతర పర్యవేక్షణ



పెట్టుబడుల ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశ్రమలుగా రూపుదిద్దుకునేలా నిరంతర పర్యవేక్షణ చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుదుర్చుకున్న ఎంఓయూల అమలు పురోగతిపై ప్రతి ఏడాది ఆడిట్ నివేదిక విడుదల చేస్తామని తెలిపారు. 2024 జూన్ నుంచి రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా ఇన్వెస్ట్ మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ తీసుకొస్తామని, కేంద్రం ఆమోదానికి పంపుతామని వెల్లడించారు. పరిశ్రమల అనుమతుల్లో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి, అవసరమైన క్లియరెన్స్ లను రియల్ టైమ్ లో అందిస్తున్నామని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు వేస్తున్నామని విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు అనంతరం వివరించారు.

రూ.32.49 లక్షల కోట్లకు పెట్టుబడులు

2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల ద్వారా రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వీటితో 19.3 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఉందని సీఎం తెలిపారు. వీటిలో 526 ప్రాజెక్టులకు భూమి, ప్రోత్సాహకాల ఆమోదం లభించిందని, 303 ప్రాజెక్టులు నిర్మాణ దశకు చేరుకున్నాయని వివరించారు. ప్రాంతీయ సదస్సులు, విశాఖ ప్రధాన సదస్సు ద్వారా కొత్తగా 303 ఒప్పందాలు కుదిరాయని, వీటి విలువ రూ.9.88 లక్షల కోట్లకు పైగా ఉందని, 3.48 లక్షల ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని చెప్పారు. దీంతో మొత్తం పెట్టుబడి ప్రతిపాదనలు రూ.32.49 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపుల్లో పారదర్శకత కోసం నవంబర్ 12 నుంచి ఎస్క్రో ఖాతాను అమల్లోకి తెచ్చామని, ఎంఎస్ఎంఈలకు కూడా దీని ద్వారానే ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.

25 సెక్టోరల్ పార్కులు.. కొత్త టెక్నాలజీ

రాష్ట్రంలో ఇప్పటికే 25 సెక్టోరల్ పార్కులు ఏర్పాటు చేశామని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను భారీ పరిశ్రమలతో అనుసంధానిస్తామని చంద్రబాబు తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా ఎంఎస్ఎంఈలకు సహకారం అందిస్తామన్నారు. అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా, విశాఖను ఐటీ, ఏఐ, డేటా సెంటర్లు, పర్యాటక రంగాలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. టెక్నాలజీపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదని, కొత్త ఆవిష్కరణలపై ముందుగా తెలుసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో ఏఐ వినియోగం, అగ్రి ప్రాసెసింగ్, కోకో మిషన్, అరకు కాఫీ ప్రమోషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. స్కిల్ సెన్సస్ ద్వారా యువత నైపుణ్యాలను గుర్తించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తామన్నారు. రోడ్లు, రైలు, విమాన, జల రవాణా అనుసంధానంతో పాటు పోలవరం, నదుల అనుసంధానం, రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంటు పునరుద్ధరణ, అనకాపల్లిలో స్టీల్ సిటీ, నక్కపల్లి కేబుళ్ల ఏర్పాటును ప్రస్తావించారు.

6,400 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్



విద్యార్థుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో గత మూడేళ్లుగా పేరుకుపోయిన రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్ హయాంలో పేద విద్యార్థులకు చదువు భరోసాగా నిలిచిన పథకం ప్రస్తుతం బకాయిలతో నిర్వీర్యమవుతోందని ఆరోపించారు. వంద రోజుల్లో బకాయిలన్నీ చెల్లిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఫీజులు అందక కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేస్తుండటంతో విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు వంటి ప్రాంతాల్లో విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు చెల్లించాలని, సర్టిఫికెట్ల నిలిపివేతను అరికట్టాలని, కళాశాలల వేధింపుల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులను కాపాడాలని షర్మిల కోరారు.



అన్నప్రసాదం ట్రస్టుకు 10 కోట్ల విరాళం

తిరుమల శ్రీవారి భక్తులకు అన్నప్రసాద సేవలు అందిస్తున్న టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు కొడాలి శ్రీకాంత్ రూ.10 కోట్ల విరాళం ప్రకటించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరిని కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను అదనపు ఈవో అభినందించారు. అన్నప్రసాద ట్రస్టుకు అందించిన ఈ భారీ విరాళం భక్తులకు ఆహార సేవల నిర్వహణకు తోడ్పడనుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కూటమి

కుప్పం టు ఇచ్ఛాపురం ప్రజా యాత్ర
175 నియోజకవర్గాలే లక్ష్యం: బోడె

స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ విమర్శించారు. మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను అధికార పార్టీకి అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలను టీడీపీ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ తరహాలో నిర్వహిస్తోందని, గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కొనసాగిస్తోందని వ్యాఖ్యానించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని కూటమి నిలబెట్టుకోలేదని విమర్శించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, హక్కుల విషయంలో స్పష్టమైన విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



2027 మే 9 నుంచి రాష్ట్రవ్యాప్త యాత్ర

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారం కోసం పోరాడేందుకు 2027 మే 9 నుంచి కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజా యాత్ర చేపడతామని రామచంద్ర యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలను ఈ యాత్ర ద్వారా కవర్ చేస్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల హక్కులు, రాష్ట్ర అభివృద్ధి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీసీవై అధికారంలోకి వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి కొత్త పార్టీ ఏర్పాటుపై స్పందిస్తూ, ఆయన వ్యక్తిగత కారణాలతోనే పార్టీ పెట్టుకున్నారన్నది తన అభిప్రాయమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కంటే వ్యక్తిగత ఎజెండాకే ప్రాధాన్యత ఇస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఫీజు బకాయిలతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం

9,600 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్
చిత్తూరు విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై జగన్



చిత్తూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పందించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేశ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలోనూ ఇదే కళాశాలలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని తన పోస్టులో ప్రస్తావించారు.

రూ.12,400 కోట్ల బకాయిలపై జగన్ లెక్కలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేశామని జగన్ పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి విద్యాదీవెన కింద 13 త్రైమాసికాలకు కలిపి రూ.9,100 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. 2024, 2025, 2026 ఏప్రిల్ నెలలకు సంబంధించి వసతి దీవెన బకాయిలు మరో రూ.3,300 కోట్లు ఉన్నాయని వివరించారు. ఈ రెండు పథకాలకు మొత్తం రూ.12,400 కోట్లు అవసరమవుతాయని, ఇప్పటివరకు రూ.1,700 కోట్లు, రూ.1,100 కోట్లు మాత్రమే చెల్లించారని ఆరోపించారు. ఇంకా రూ.9,600 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యార్థులపై కళాశాలల ఒత్తిడి ఆపాలి

ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఆ భారాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మోపుతున్నాయని జగన్ ఆరోపించారు. ఫీజులు కట్టకపోతే పరీక్షలకు అనుమతించబోమని, సర్టిఫికెట్లు ఇవ్వబోమని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. దీంతో కొందరు విద్యార్థులు చదువులు వదిలి పనులకు వెళ్తుండగా, మరికొందరు ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖలో లోకేశ్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని, పెండింగ్ లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని చంద్రబాబును డిమాండ్ చేశారు. కళాశాలల్లో విద్యార్థులపై ఒత్తిడి నిలిపివేయాలని, విద్యార్థిని ఘటనపై ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

జనసేన పేరు చెప్పి రూ.7 కోట్ల మోసం!

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో టోకరా

ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ పేరు, మంగళగిరిలోని పార్టీ కార్యాలయాన్ని అడ్డం పెట్టుకుని నిరుద్యోగులను మోసం చేసినట్లు ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ దాదాపు రూ.7 కోట్లు వసూలు చేసినట్లు ప్రాథమిక సమాచారం. ఏలూరు, తణుకు ప్రాంతాలకు చెందిన సుమారు 20 మంది ఉద్యోగార్థులు ఈ మోసానికి బలైనట్లు తెలుస్తోంది. ధరణి అనే వ్యక్తి జనసేన నేతలతో తనకు పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పార్టీ మంగళగిరి కార్యాలయం పేరును ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించినట్లు సమాచారం.



నేతల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

జనసేన నేతలు కల్యాణం శివ శ్రీనివాస్ (కేకే), కోట రుక్మిణి పేర్లను కూడా ధరణి దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న ఇద్దరు నేతలు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యాలయం పేరు, తమ వ్యక్తిగత గుర్తింపును ఉపయోగించి ఉద్యోగార్థులను మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితుల సంఖ్య, ఒక్కొక్కరి నుంచి వసూలు చేసిన నగదు వివరాలు, మోసం జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు. మరోవైపు నిందితుడు ధరణి పరారీలో ఉన్నట్లు సమాచారం. అతడి ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు.

విజయవాడ లాడ్జిలో మహిళ దారుణ హత్య



విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో 35 ఏళ్ల పైడిశెట్టి యర్రమ్మ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆమెను ప్రియుడు రాము హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఓ ప్రైవేట్ షాపింగ్ మాల్ లో సేల్స్ ఉమెన్ గా పనిచేస్తున్న యర్రమ్మకు భర్త సింహాద్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో రామా క్లాత్ స్టోర్స్ లో పనిచేసిన సమయంలో రాముతో పరిచయం ఏర్పడగా, అది వ్యక్తిగత సంబంధంగా మారినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నవంబర్ 11న విధులకు వెళ్లిన యర్రమ్మ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె భర్త గురువారం సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో రామయ్య లాడ్జికి యర్రమ్మ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. లాడ్జి నుంచి రాము బయటకు వెళ్లిపోయాడని, యర్రమ్మ మాత్రం గదిలోనే ఉండిపోయిందని కృష్ణలంక సీఐ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం గదిలో ఆమె మృతదేహాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. అయితే హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనా స్థలంలో రక్తపు మరకలు కూడా కనిపించలేదని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడు రాము పరారీలో ఉండటంతో అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



భారత్ సమ్మిట్.. గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్

- భారత్ సమ్మిట్‌పై పెరిగిన ఎక్స్‌పెక్టేషన్
- గ్లోబల్ సదస్సుతో ప్రపంచ స్థాయి రికగ్నిషన్
- పెట్టుబడులకు హైదరాబాద్ డెస్టినేషన్
- భట్టి నేతృత్వంలో తెలంగాణ ప్రజంటేషన్

హైదరాబాద్ అంటే ఐటీ.. హైదరాబాద్ అంటే పెట్టుబడులు.. హైదరాబాద్ అంటే పారిశ్రామిక అభివృద్ధి! ఇప్పటివరకు ప్రపంచానికి తెలిసిన తెలంగాణ రాజధాని గుర్తింపులు ఇవే. కానీ ఇప్పుడు ఈ నగరానికి మరో కొత్త చిరునామాగా నిలపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ప్రపంచ రాజకీయాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వంపై అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరిగే వేదికగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యానికి కార్యరూపం ఇచ్చే ప్రయత్నంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక సారథిగా వ్యవహరిస్తున్నారు. భారత్ సమ్మిట్ 2.0ను కేవలం ఒక అంతర్జాతీయ సమావేశంగా కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ నాయకులు, మేధావులు, విధాన నిర్ణేతలు కలుసుకునే వేదికగా తీర్చిదిద్దాలన్నది ఆయన ముందుంచిన ఆలోచన. ప్రపంచవ్యాప్తంగా కుల, మత విభజనలు, రాజకీయ విద్వేషాలు, హింసాత్మక ధోరణులు పెరుగుతున్న సమయంలో వాటికి ప్రత్యామ్నాయంగా అహింస, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం అనే విలువలను ప్రపంచానికి చాటాలన్నది ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. ఈ ఆలోచనను ప్రభుత్వ కార్యక్రమంగా మార్చేందుకు భట్టి స్వయంగా ముందుండి చర్చాంశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, తెలంగాణ అభివృద్ధి కోణాలను వివరిస్తున్నారు. గత ఏడాది తొలి భారత్ సమ్మిట్‌కు వచ్చిన స్పందనను మరింత విస్తృతం చేస్తూ రెండో సంచికను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఒకప్పుడు ప్రపంచ పెట్టుబడుల చర్చలకు దావోస్ పేరు వినిపించినట్లే, భవిష్యత్తులో ప్రజాస్వామ్య, సామాజిక, రాజకీయ ఆలోచనలకు హైదరాబాద్ పేరు వినిపించాలన్నది భట్టి ప్రతిపాదిస్తున్న దీర్ఘకాలిక లక్ష్యం. ఇది ఒక్క సదస్సు నిర్వహణతో ముగిసిపోయే ఆలోచన కాదు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ మేధో చర్చలకు శాశ్వత వేదికగా నిలబెట్టాలన్న ప్రభుత్వ సంకల్పం.

తెలంగాణ రైజింగ్.. ప్రపంచానికి రాష్ట్ర సామర్థ్యం చాటే వేదిక!

భారత్ సమ్మిట్‌ను అంతర్జాతీయ చర్చలకే పరిమితం చేయకుండా తెలంగాణ అభివృద్ధికి కూడా ఉపయోగించుకోవాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ మరో ముఖ్యమైన వ్యూహం. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణలోని పారిశ్రామిక అవకాశాలు, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయ విధానాలను పరిచయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్' పేరుతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలను రూపొందించింది. భవిష్యత్ నగరాల నిర్మాణం, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమం, సహకార సమాఖ్య విధానం, సంస్కృతి, యువత, క్రీడలు, ఎన్నికల సమగ్రత వంటి విస్తృత అంశాలను చర్చల్లో చేర్చారు. ఈ కార్యక్రమాల రూపకల్పనలో భట్టి విక్రమార్క ప్రత్యేక ఆసక్తి చూపిస్తూ తెలంగాణ అభివృద్ధి దృక్పథాన్ని అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించే బాధ్యతను ముందుండి నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలు ప్రపంచానికి తెలియాలన్నది ఆయన ఆలోచన. హైదరాబాద్‌కు ఇప్పటికే పెట్టుబడుల కేంద్రంగా గుర్తింపు ఉంది. ఇప్పుడు ఆ గుర్తింపును మరింత విస్తరించి, ప్రపంచ విధాన నిర్ణేతలు రాష్ట్ర అభివృద్ధి నమూనాలను పరిశీలించే స్థాయికి తీసుకెళ్లాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యంగా తెలంగాణ రైజింగ్ విజన్ ద్వారా రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలను అంతర్జాతీయ వేదికపై పరిచయం చేయాలని భావిస్తున్నారు. ఇక్కడికి వచ్చే పారిశ్రామికవేత్తలు, మేధావులు, విధాన నిర్ణేతలతో ఏర్పడే పరిచయాలు భవిష్యత్తులో పెట్టుబడులకు దోహదపడవచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది. అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం, కొత్త పరిశ్రమల అవకాశాలకు కూడా ఈ సదస్సు వేదిక కావచ్చని భావిస్తోంది. డిసెంబరులో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్ తెలంగాణ కార్యక్రమానికి భారత్ సమ్మిట్ ద్వారా ఏర్పడే అంతర్జాతీయ పరిచయాలు ఉపయోగపడతాయని భట్టి పేర్కొంటున్నారు. అంటే ఒకే వేదికపై రెండు లక్ష్యాలు నెరవేర్చుకోవాలన్నది ప్రభుత్వ వ్యూహం. ప్రపంచానికి ప్రజాస్వామ్య సందేశం ఇవ్వడం, తెలంగాణకు పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలు తీసుకురావడం. ఈ రెండు అంశాలను సమన్వయం చేస్తూ భట్టి విక్రమార్క సదస్సుకు తెలంగాణ అభివృద్ధి కోణాన్ని జోడిస్తున్నారు. ప్రపంచం హైదరాబాద్‌కు రావాలి.. హైదరాబాద్ సామర్థ్యాన్ని గుర్తించాలి.. తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలి.. ఇదే ఈ కార్యక్రమం వెనుక ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్ష.

• దావోస్‌కు దీటుగా హైదరాబాద్.. భట్టి అంతర్జాతీయ వ్యూహం!


ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, పారిశ్రామిక విధానాలపై చర్చలకు దావోస్ అంతర్జాతీయ కేంద్రంగా గుర్తింపు పొందింది. అదే తరహాలో ప్రపంచ రాజకీయాలు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఆర్థిక విధానాలపై చర్చలకు హైదరాబాద్‌ను మరో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది భట్టి విక్రమార్క ఆలోచన. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారత్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. సుమారు 70 దేశాల నుంచి వెయ్యికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని భావిస్తున్నారు. వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు, మేధావులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకత. వీరంతా తమ దేశాల్లో ఎదురవుతున్న సమస్యలను చర్చించడంతోపాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను అన్వేషించనున్నారు. ఈ ప్రతినిధులకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం ద్వారా తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త పరిచయాలు ఏర్పడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా భట్టి విక్రమార్క సదస్సు ఉద్దేశాలను వివరిస్తూ, హైదరాబాద్‌కు రావాల్సిన అంతర్జాతీయ గుర్తింపును పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇప్పటికే ఐటీ, ఔషధ పరిశ్రమలు, వైద్య రంగం, పెట్టుబడుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్‌కు ఇప్పుడు విధాన చర్చల నగరంగా మరో ప్రత్యేకతను సంతరించుకునేలా చేయాలన్నది ఆయన లక్ష్యం. ఇక్కడ జరిగే చర్చలు ప్రపంచవ్యాప్తంగా ఇతర వేదికలకు చేరితే హైదరాబాద్ పేరు మరింత విస్తృతంగా వినిపించే అవకాశం ఉంటుంది. ఇక్కడికి వచ్చే ప్రతినిధులు తెలంగాణలోని అభివృద్ధి అవకాశాలను తెలుసుకుని తమ దేశాల్లో పరిచయం చేసే అవకాశం కూడా ఉంటుంది. తద్వారా భవిష్యత్తులో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పెట్టుబడులకు కొత్త మార్గాలు ఏర్పడవచ్చు. డిసెంబరులో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్ తెలంగాణ కార్యక్రమానికి కూడా ఈ పరిచయాలు ఉపయోగపడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఒకవైపు ప్రపంచానికి తెలంగాణను పరిచయం చేయడం, మరోవైపు ప్రపంచాన్ని తెలంగాణకు దగ్గర చేయడం.. ఈ రెండు లక్ష్యాల మధ్య భారత్ సమ్మిట్‌కు భట్టి నాయకత్వం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

• నెహ్రూ ఆలోచనలకు పునర్జీవం.. అలీన విధానంపై భట్టి ప్రత్యేక దృష్టి!

భారత్ సమ్మిట్‌లో జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన అలీన విధానానికి ప్రత్యేక స్థానం కల్పించడం వెనుక కూడా భట్టి విక్రమార్కకు ఒక స్పష్టమైన ఆలోచన ఉంది. ప్రపంచం రెండు ప్రధాన శక్తి కేంద్రాలుగా విడిపోయిన ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, సోవియట్ యూనియన్ కూటముల్లో చేరకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించే మార్గాన్ని నెహ్రూ ప్రతిపాదించారు. యుగోస్లేవియా నాయకుడు మార్షల్ టిటో సహా ఇతర అంతర్జాతీయ నాయకులతో కలిసి అలీనోద్యమాన్ని బలోపేతం చేశారు. ప్రపంచ శక్తుల మధ్య పోటీ ఉన్నప్పటికీ ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవాలన్నది ఆ విధానంలోని ప్రధాన భావన. నేటి అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ ఆ ఆలోచనకు ఎంతో ప్రాముఖ్యత ఉందని భట్టి అభిప్రాయపడుతున్నారు. భారత్ జనాభా, ఆర్థిక సామర్థ్యం, మేధో సంపత్తి పరంగా ప్రపంచంలో కీలక స్థానంలో ఉందని, ఇతర దేశాల మధ్య జరిగే శక్తుల పోరాటాల్లో భాగస్వామిగా మారకుండా స్వతంత్ర వైఖరిని కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన వివరిస్తున్నారు. ఇదే సమయంలో నెహ్రూ అనుసరించిన మిశ్రమ ఆర్థిక విధానాన్ని కూడా భట్టి ప్రస్తావిస్తున్నారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైతే ఆర్థిక అసమానతలు పెరుగుతాయని, ఉత్పత్తి వ్యవస్థల్లో ప్రభుత్వానికి కూడా కీలక పాత్ర ఉండాలని నెహ్రూ భావించినట్లు గుర్తుచేస్తున్నారు. బొగ్గు, ఉక్కు వంటి కీలక రంగాల్లో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించడం, పరిశ్రమల అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యాన్ని పెంచడం ఆ ఆలోచనలో భాగమని వివరిస్తున్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి సంస్థలను ఈ విధానానికి ఉదాహరణలుగా పేర్కొంటున్నారు. సంపద సృష్టి కొద్దిమందికి మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందాలన్నదే ఈ విధానం వెనుక ఉన్న ఉద్దేశమని చెబుతున్నారు. ప్రస్తుత ప్రపంచంలో సంపన్నులు మరింత సంపన్నులవుతుండగా, పేదరికం, ఆర్థిక అంతరాలు కొనసాగుతున్నాయని భట్టి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అసమానతలకు పరిష్కారాలు అన్వేషించేందుకు అంతర్జాతీయ వేదికలపై చర్చలు అవసరమని చెబుతున్నారు. అందుకే భారత్ సమ్మిట్‌లో చరిత్రను గుర్తుచేసుకోవడమే కాకుండా, నేటి ప్రపంచానికి అవసరమైన ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయాలపై చర్చ జరగాలని ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

• ప్రజాస్వామ్యానికి అసలైన బలం.. ప్రతిపక్షానికి గౌరవం!

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం, మెజారిటీ సాధించిన పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం మాత్రమే కాదని భట్టి విక్రమార్క స్పష్టం చేస్తున్నారు. అధికార పక్షంతో పాటు ప్రతిపక్షానికి కూడా సముచిత స్థానం, రాజ్యాంగబద్ధమైన గౌరవం ఉండాలని ఆయన చెబుతున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, తప్పులను ఎత్తిచూపడం, ప్రత్యామ్నాయ అభిప్రాయాలను ప్రజల ముందుంచడం ప్రతిపక్షాల బాధ్యత అని వివరిస్తున్నారు. అధికారంలో ఉన్నవారు విమర్శలను స్వీకరించాలి. ప్రతిపక్షాల గొంతుకకు స్థానం కల్పించాలి. భిన్నాభిప్రాయాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ఇదే ప్రజాస్వామ్య వ్యవస్థకు అసలైన బలమని ఆయన అభిప్రాయపడుతున్నారు. రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా భావించడం, వారి గొంతును అణచివేయాలనే ధోరణి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంటున్నారు. నియంతృత్వ వ్యవస్థల్లో కనిపించే అణచివేతకు భిన్నంగా ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉండాలని చెబుతున్నారు. అందుకే భారత్ సమ్మిట్‌లో భావప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కులు, ప్రతిపక్షాల పాత్ర, ఎన్నికల సమగ్రత వంటి అంశాలను కీలక చర్చాంశాలుగా చేర్చారు. ఈ సదస్సుపై బీజేపీ, బీఆర్ఎస్ సహా కొన్ని రాజకీయ పక్షాలు వ్యక్తం చేస్తున్న విమర్శలకు కూడా భట్టి స్పందించారు. విదేశీ ప్రతినిధులు వేరే ఎజెండాతో వస్తున్నారనే ఆరోపణలను ప్రస్తావిస్తూ ప్రజాస్వామ్యం, అహింస, సామాజిక న్యాయం, పౌర హక్కులపై చర్చించడం దేశానికి వ్యతిరేకమైన చర్య ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రపంచంలోని వివిధ దేశాల ప్రతినిధులు తమ అనుభవాలను పంచుకోవడం, విధానాలపై చర్చించడం ఈ సదస్సు లక్ష్యమని వివరించారు. అదే సమయంలో భిన్న రాజకీయ భావజాలాలకు చర్చల్లో స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతిపక్షాలకు కూడా ప్రజాస్వామ్య చర్చల్లో భాగస్వామ్యం కల్పించే ఉద్దేశాన్ని వెల్లడించారు. ఈ విధంగా భారత్ సమ్మిట్‌ను ఒక పార్టీకి సంబంధించిన రాజకీయ కార్యక్రమంగా కాకుండా, ప్రజాస్వామ్యంపై విస్తృత చర్చకు వేదికగా నిలబెట్టాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నం. భట్టి ఈ అంశాన్ని ముందుండి వివరిస్తూ సదస్సు వెనుక ఉన్న మౌలిక ఆలోచనను ప్రజలకు చేరవేస్తున్నారు.



• ఓటు హక్కు నుంచి ప్రపంచ శాంతి వరకు.. భట్టి దార్శనికత!

భారత్ సమ్మిట్ వెనుక ఉన్న ఆలోచనను వివరిస్తూ భట్టి విక్రమార్క పదేపదే ప్రస్తావిస్తున్న మరో అంశం ప్రజాస్వామ్యంలో పౌరుడి పాత్ర. ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలని, ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా ఎన్నుకునే పరిస్థితులు ఉండాలని ఆయన చెబుతున్నారు. ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని, ప్రజల హక్కులను కాపాడాలని స్పష్టం చేస్తున్నారు. ఆ బాధ్యత నుంచి ప్రభుత్వాలు పక్కకు తప్పినప్పుడు మేధావులు, తాత్వికవేత్తలు, ప్రజాస్వామ్యవాదులు సమాజ భవిష్యత్తుపై చర్చించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. కార్ల్ మార్క్స్, మహాత్మా గాంధీ వంటి తాత్వికవేత్తలు ప్రభుత్వ పదవుల్లో లేకపోయినా ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఆలోచనలను అందించారని గుర్తుచేస్తున్నారు. సమాజానికి ఉపయోగపడే ఆలోచనలను ప్రభుత్వాలు స్వీకరించి విధానాలుగా అమలు చేయాలని సూచిస్తున్నారు. యుద్ధాలు, హింస, మత విద్వేషాలు, ఆర్థిక అసమానతలు ప్రపంచ మానవాళికి సవాళ్లుగా మారుతున్న సమయంలో దేశాల మధ్య చర్చలు మరింత అవసరమని చెబుతున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం ఆధారంగా ప్రపంచ భవిష్యత్తుకు ఉపయోగపడే విధానాలను రూపొందించడమే భారత్ సమ్మిట్ ఆశయమని వివరిస్తున్నారు. ఈ భారీ కార్యక్రమాన్ని ఒక్క వ్యక్తి నిర్వహిస్తున్నారనే భావన కలిగించకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రిపర్గం, వివిధ ప్రభుత్వ శాఖలు సమష్టిగా పనిచేస్తున్నాయని భట్టి స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించిన దార్శనికతను ప్రజల్లోకి తీసుకెళ్లడం, అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్ ప్రాధాన్యాన్ని వివరించడం, చర్చాంశాలకు ఒక స్పష్టమైన దిశను ఇవ్వడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. భారత్ సమ్మిట్‌ను ప్రతి ఏడాది కొనసాగిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విధాన నిర్ణేతలు కలుసుకునే కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యం. అయితే ఈ ప్రయత్నం విజయాన్ని నిర్ణయించేది కేవలం హాజరయ్యే దేశాల సంఖ్య కాదు. చర్చల నాణ్యత, వెలువడే విధాన సూచనలు, వాటి ఆచరణ, హైదరాబాద్‌కు లభించే అంతర్జాతీయ గుర్తింపే అసలైన కొలమానం. ఒకప్పుడు ఐటీ రంగంతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన హైదరాబాద్.. ఇప్పుడు ప్రజాస్వామ్య చర్చలతోనూ అంతర్జాతీయ వేదికపై తన ఉనికిని చాటుకోవాలన్న ప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయత్నానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ సంకల్పాన్ని అందిస్తుండగా, భట్టి విక్రమార్క కీలక సారథిగా ముందుండి నడిపిస్తున్నారు. హైదరాబాద్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలి.. ప్రపంచ ఆలోచనలకు హైదరాబాద్‌ను చిరునామా చేయాలి.. తెలంగాణను అంతర్జాతీయ విధాన చర్చల్లో భాగస్వామిని చేయాలి! ఇదే భారత్ సమ్మిట్ 2.0 వెనుక ఉన్న ప్రభుత్వ సంకల్పం.. భట్టి విక్రమార్క ముందుకు తీసుకెళ్తున్న ప్రధాన లక్ష్యం.





రాహుల్ పిలుపే శాసనం..

గాంధీ కుటుంబమే ప్రాణం!

కొన్ని అనుబంధాలు పదవులతో ఏర్పడవు. కొన్ని సంబంధాలు రాజకీయ అవసరాల కోసం పుట్టవు. మరికొన్ని అభిమానాలు అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కనిపించి, పరిస్థితులు మారగానే కనుమరుగవుతాయి. కానీ రాజకీయాల్లో కొందరి అనుబంధాలు మాత్రం కాలంతో పాటు కొనసాగుతుంటాయి. తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి వ్యవహారశైలిని పరిశీలిస్తే గాంధీ కుటుంబంతో ఆయనకు ఉన్న అనుబంధం ప్రత్యేకంగా కనిపిస్తుంది. ముఖ్యంగా రాహుల్ గాంధీ రాజకీయ కార్యక్రమాల పట్ల ఆయన చూపిస్తున్న ఆసక్తి, సంగారెడ్డిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఈ అనుబంధానికి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఏ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నించినా, దానికి తెలంగాణలో తన నియోజకవర్గం నుంచి మద్దతు అందించాలనే ప్రయత్నం జగ్గారెడ్డి చేస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రకటనతో సరిపెట్టే వ్యవహారం కాదు. సభలు, ర్యాలీలు, దీక్షలు, కార్యకర్తల సమీకరణ, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆయన రాజకీయ ఆలోచనల్లో రాహుల్ నాయకత్వం, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు ఒకదానితో మరొకటి ముడిపడి కనిపిస్తాయి. గాంధీ కుటుంబంపై తనకున్న అభిమానాన్ని మాటల్లోనే కాకుండా కార్యాచరణలోనూ వ్యక్తం చేయాలనే ప్రయత్నం ఆయన రాజకీయ ప్రయాణంలో ప్రత్యేక అంశంగా మారింది.

రాజకీయాలకు అతీతమైన బంధం!

- రాహుల్ అజెండాపై నమ్మకం
- సోనియా జీవితంపై సినిమా ప్రకటనతో చర్చ!
- టీకాంగ్రెస్ నేతల్లో విలక్షణనేత జగ్గారెడ్డి



• రాహుల్ పిలుపు.. సంగారెడ్డిలో కార్యాచరణ!

